## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అలంపూర్:** సబ్ డివిజనల్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. 33 కేవీ ఉండవెల్లి, శాంతినగర్– 2 ఫీడర్ల లైన్లలో చెట్ల కొమ్మలు తొలగించడం, ఒరిగిన విద్యుత్ స్తంభాలు తదితర పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా అలంపూర్ సబ్ డివిజన్ పరిధిలోని అలంపూర్, మానపాడ్, ఉండవెల్లి, వడ్డేపల్లి, ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల పరిధిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్లలో నెలవారీ మరమ్మత్తు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

### సర్వేల పేరుతో పథకాలు పక్కదారి

**రాజోళి:** సర్వేల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నాడని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలుగా హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీల అమలును తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీలను మరిపించేందుకు, సర్వే పేరుతో పథకాలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పథకాల అమలు కోసం ప్రజల తరఫున పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

### ముమ్మరంగా వాహన తనిఖీలు



**మానవపాడు:** వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ చంద్రకాంత్ సూచించారు. శుక్రవారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్ గ్రామాల శివారులో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు.

### తహసీల్దార్‌పై కేసు ఎత్తివేయాలి

**శాంతినగర్:** ఇటిక్యాల తహసీల్దార్‌పై అక్రమంగా నమోదు చేసిన కేసును ఎత్తివేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తహసీల్దార్‌పై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టినందుకు ఆ కేసును నీరుగార్చేందుకే తహసీల్దార్‌పై కౌంటర్ కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఎస్పీ స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపి తహసీల్దార్‌పై నమోదు చేసిన కేసును ఎత్తివేయాలని కోరారు. లేకుంటే జిల్లాలో జరుగుతున్న ఘటనలపై త్వరలోనే డీజీపీ, హ్యూమన్‌రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

### రేషన్ బియ్యం పట్టివేత



**అలంపూర్:** ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. అలంపూర్ మండలంలోని కాశాపురం గ్రామంలో శుక్రవారం సాధారణ తనిఖీలు చేస్తుండగా.. 3.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకున్నామన్నారు. కర్నూల్ జిల్లా కేంద్రంలోని షరీఫ్ నగర్‌కు చెందిన రాఘురామయ్య తన ఆటోలో ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు.

### వివాహిత అదృశ్యం

**ఉండవెల్లి:** మండలంలోని బొంకూరు గ్రామానికి చెందిన హారిక అలియాస్ ఇందుమతి (42) అనే వివాహిత శుక్రవారం ఉదయం శ్రీశైలం వెళ్తునట్లు చెప్పి, పక్కింటి వారికి తాళం ఇచ్చి వెళ్లిపోగా ఆమె అన్న హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహేష్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంకూరుకు చెందిన నాగరాజుతో ఇందుమతికి 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నేళ్లుగా బిజినెస్‌లో నష్టం వచ్చిందని భార్య, భర్తలకు గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి పక్కింటి వాళ్లకు తాళం ఇచ్చి శ్రీశైలం వెళ్తున్నానని వెళ్లింది. ఆమె అన్న కర్నూల్ జిల్లా రేమట్లకు చెందిన హరిప్రసాద్ ఫోన్ చేయగా స్విచాఫ్ రావడంతో.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# పకడ్బందీగా ఇంటింటి సర్వే



రాజోళి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాదాసి కురవ సంఘం నాయకులు

**మానవపాడు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే ముగిసిందని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దపోతులపాడు, జల్లాపురంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఇంటింటి సర్వే కార్యక్రమం ముగిసిందని, శనివారం నుంచి కుటుంబ సర్వే చేపట్టేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయా గ్రామాల్లో అధికారులకు సమాచారం అందించి సహకరించాలని సూచించారు.

**మాదాసి కుర్వగా నమోదు చేయాలి**

**రాజోళి:** ప్రభుత్వం చేస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో కురవలను మాదాసి కురవగా నమోదు చేయాలని మాన్‌దొడ్డి గ్రామ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే వివరాలు నమోదు చేసుకునే పత్రంలో ఎస్సీ గెజిట్ సీరియల్ నెంబర్ 30లో మాదాసి, మాదారి కురవగా ఉందని, బీసీ బీ గెజిట్ సీరియల్ నెంబర్ 11లో కురబ, కురమ ఉందని, ఎక్కడ బీసీ గెజిట్‌లో కురవ అనే పదం లేదని, లేని కులం పేరుతో మాకు సర్టిఫికెట్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కుల గణన సర్వేలో మాదాసి కురవ అని నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలా నమోదు చేయని క్రమంలో సర్వేను బహిష్కరిస్తామన్నారు.



పెద్దపోతులపాడులో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ భాస్కర్

### కుల గణనతో బీసీలకు న్యాయం



అయిజలో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి

**అయిజ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన కార్యక్రమం దేశంలోనే చారిత్రాత్మకమని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ఏనాడు ప్రభుత్వాలు బీసీల గణాంకాలు చేయకుండా వీరి వెనకబాటుతనానికి కారకులయ్యారని ఆరోపించారు. గణాంకాల సేకరణకు వచ్చిన అధికారులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించి బీసీల సామాజిక న్యాయానికి దోహదపడాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయబద్ధమైన సీట్లు కేటాయించేందుకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల నాగిరెడ్డి, శ్రీధర్, మద్దిలేటి, దేవరాజు, రాజెమ్మ, సాంబశివుడు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



గుడ్డెందొడ్డిలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

**ధరూరు:** మండలంలోని ఉప్పేరు, గుడ్డెందొడ్డి గ్రామాల్లోని పాఠశాలలను శుక్రవారం ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న నేషనల్ అచీవ్‌మెంట్ పరీక్షలను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలతో మాట్లాడి.. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించి పాఠశాల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, హాజరు శాతం తక్కువగా ఉన్న పిల్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు.

# ఎల్‌కే అద్వానీ ఆశయ సాధనే లక్ష్యం



అయిజలో రోగులకు పండ్లు పంచుతున్న బీజేపీ నాయకులు



జూలెకల్ గ్రామంలో.. రోగులకు పండ్ల పంపిణీ

**శాంతనగర్:** నమ్మిన సిద్ధాంతాల కోసం వెన్ను చూపకుండా పోరాడిన గొప్ప నాయకుడు ఎల్‌కే అద్వానీ అని యువకులు కొనియాడారు. దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన లాల్‌కృష్ణ అద్వానీ జయంతిని పురస్కరించుకొని వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 15 ఏళ్ల వయసులోనే ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరిన దేశభక్తుడు అని, అయోధ్య శ్రీరాముడి రథసారథి, అద్వానీ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, గోపాల్, శ్రీను, ఆంజనేయులుగౌడ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**అయిజ:** బీజేపీ నాయకుడు ఎల్‌కే అద్వానీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. లాల్‌కృష్ణ అద్వానీ 15 ఏళ్ల వయసులోనే ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి, హిందుత్వ ఎజెండా కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. అనంతరం దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని యువకులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివారెడ్డి, ప్రదీప్ కుమార్, లక్ష్మణ్ గౌడ్, భీమన్న, ఆచారి పాల్గొన్నారు.

# అలంపూర్ నుంచి శ్రీశైలం సైకిల్ యాత్ర

**అలంపూర్:** అలంపూర్ టూ శ్రీశైల క్షేత్రానికి సైకిల్ యాత్రను యువకులు శుక్రవారం ప్రారంభించారు. అలంపూర్ క్షేత్రంలోని శ్రీజోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి సన్నిధిలో యువకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాదాపు వంద మంది యువకులు శ్రీశైలం క్షేత్ర యాత్రకు బయల్దేరారు. పదిహేనేళ్లుగా యువకులు కార్తీక మాసంలో అలంపూర్ నుంచి శ్రీశైలం క్షేత్రానికి యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. మొదట్లో సైకిల్ యాత్ర చేపట్టిన యువకులు నర్సప్ప, సుంకన్నలను ఈ సందర్భంగా స్మరించుకున్నట్లు తెలిపారు. యువకులు అన్నదానం కోసం ప్రతి ఏడాది సైకిల్ లక్కీ లాటరీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఏడాది సైకిల్ లక్కీ డ్రా తీయగా.. సింగవరం గ్రామానికి చెందిన సాయినాథ్‌కు దక్కినట్లు తెలిపారు. డ్రా తీసేందుకు ఆసక్తి గల వారికి టోకెన్లు ఇవ్వడం ద్వారా సమకూరిన నగదుతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రశాంత్, శీను, భూపాల్, బీచుపల్లి, చిన్న సుధాకర్, అంజి, రవి తదితరులు ఉన్నారు.



అలంపూర్ నుంచి శ్రీశైలానికి బయల్దేరుతున్న యువకులు

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు

**గట్టు:** మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్ పర్సన్లతో గట్టులోని రైతువేదికలో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పాఠశాలల వారీగా నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అమ్మ ఆదర్శ కమిటీలు చేస్తున్న పనులపై సమీక్షించారు. కమిటీల విధులు, బాధ్యతలు, విద్యాభివృద్ధి కోసం ఎంవీఎఫ్ చేస్తున్న కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల నియంత్రణకు సూచనలు అందించారు. అనంతరం మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివుడు, సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

### రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థి ఎంపిక




**ధరూరు:** రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ధరూరుకు చెందిన విద్యార్థి ఎంపికైనట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 6న మహబూబ్‌నగర్‌లో జరిగిన రగ్బీ సెలక్షన్స్‌లో అండర్ 17 విభాగంలో గద్వాల జిల్లా తరఫున ధరూరు ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి చింటు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా మేడ్చల్‌లో నిర్వహించే రాష్ట్ర రగ్బీ పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాఘవేంద్ర, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

### భవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు



**గట్టు:** మండల కేంద్రంలోని భవానీమాత ఆలయంలో శుక్రవారం ఎస్‌ఎస్‌కే సమాజ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసహస్రార్జున మహారాజ్ జయంతిని పురస్కరించుకొని భవానీమాత ఆలయంలో సహస్రార్జున మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు కేపీ అంబుసా, సంఘం సభ్యులు ఈరన్న, శ్రీను, లక్ష్మణ్, చంద్రమోహన్, అంబదాస్, సురేష్, శివుడు, చందు, వినోద్, రాము, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### ఆలయాల్లో కుంకుమార్చన



**ఎర్రవల్లి:** బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం అర్చకులు అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. అదేవిధంగా ఎర్రవల్లి మండల కేంద్రంలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో కుంకుమార్చన చేశారు.

### శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

**అయిజ:** మున్సిపాలిటీలోని తుపత్రాల గ్రామంలో శుక్రవారం సీతారామాంజనేయ స్వామి, గుంటి రంగనాథస్వామి ఆలయాల వద్ద వేదపండితులు శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. ఈసందర్భంగా ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులు అన్నదానం చేశారు.

# ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

**మానవపాడు:** మండలకేంద్రంలోని ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకేంద్రంలోని స్టోర్ గది, వాక్సిన్ నిల్వ గదిని, కాన్పుల గది, వార్డును పరిశీలించారు. ఈ మేరకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరోగ్య మహిళా ప్రోగ్రాంను, బాలింతలకు అందుతున్న సేవలు, ఆరోగ్య కేంద్రంలోనే సాధారణ కాన్పులు అయ్యే విధంగా అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. హై రిస్కు గర్భిణులకు 102 వాహనంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రక్త పరీక్షలు విధిగా నిర్వహించాలన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా వచ్చే అంటు రోగాలపై జాగ్రత్తలు తీసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్లు సింధు, యాకుబ్‌బాషా, హెలెన్, చంద్రన్న, తిరుమల్ రావు, సోని, రేవతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి

# తప్పెట్లమొర్సులో పశువైద్య శిబిరం



తప్పెట్లమొర్సులో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

**గట్టు:** తప్పెట్లమొర్సు గ్రామంలో శుక్రవారం ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఫౌండేషన్ సహకారంతో భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్య శిబిరంలో 5 పశువులకు గర్భకోశ పరీక్షలు, 264 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. పశువైద్యాధికారులు శంకరయ్య, ప్రియాంక మాట్లాడుతూ పాల దిగుబడి పెంపేందుకు నిత్యం పాడి పశువులకు సరైన పోషకాలు కలిగిన ఆహారం, బలమైన దినుసులతో కూడిన ధాన్యాన్ని తయారు చేసి అందించాలన్నారు. గాలికుంటు వ్యాధి వలన పశువుల నోటిలో, కాలి గిట్టల్లో పుండ్లు, నోటిలో జొల్లు, చొంగ కారడం, మేత తినకుండా ఉండడం, జ్వరం వచ్చి బలహీనంగా మారడం వంటి లక్షణాలుంటాయని తెలిపారు. రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ పేదిరక నిర్మూలన అధికారులు వెంకటేశ్వర్లు, హరికృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్లు పృథ్వీరాజ్, అబ్దుల్‌ఖాజా, ఓఎస్ గోపాలమిత్రలు ఉరుకుందు, పరమేష్‌నాయుడు, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ నాయకుల ప్రత్యేక పూజలు

**కేటీదొడ్డి:** మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామిని బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా బీఆర్‌ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్రాలతో ఆయన్ను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వారి దయతో ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాములు, శేఖర్‌నాయుడు, తిరుమలేష్, మునిమౌర్యరాజు, రాము, పరుశరాముడు, తిమ్మప్పగౌడు, కృష్ణారెడ్డి, కామేష్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వీధి స్తంభాలు ఏర్పాటు చేయండి



ఏఈ నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**అయిజ:** పట్టణంలోని వివిధ కాలనీల్లో వీధి స్తంభాలు ఏర్పాటు చేయకపోవడం వలన ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, విద్యుత్ స్తంభాలను వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏఈ నరేందర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని భరత్‌నగర్, గాజులపేట, మైనోలని గద్ద కాలనీలతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, వీరేష్, మత్తళి, రామకృష్ణ, శంకర్, మల్లేష్, రంగస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

**అలంపూర్:** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని అలంపూర్ సీఐ రవిబాబు అన్నారు. ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదేశాలతో శుక్రవారం అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో విద్యార్థులకు బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం కలిగే నష్టాలను వివరించారు. సైబర్ నేరాళ్లపై అప్రమత్తంగా ఉండాలని, చిన్నతనం నుంచి సెల్‌ఫోన్ వినియోగించడం వల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో విద్యార్థులు ప్రవర్తన తీరు గురించి సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉండవెల్లి ఎస్‌ఐ మహేష్, విశ్వశాంతి విద్యాలయ సంస్థ చైర్మన్ మురళీధర్‌రెడ్డి, డైరెక్టర్ మంజుల, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

# బస్సులు సమయపాలన పాటించాలని నిరసన



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

**అయిజ:** మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురం గ్రామంలో విద్యార్థులు, తల్లిదండ్రులు శుక్రవారం అయిజ, కర్నూల్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆర్టీసీ బస్సులు పాఠశాలల వేళలకు రావడం లేదని, వచ్చిన బస్సులు కూడా ఆపకుండా నేరుగా పోతున్నాయని విద్యార్థులు వాపోయారు. దీంతో పాఠశాలలకు సరైన సమయానికి చేరుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చదువు కుంటుపడుతుందన్నారు. ఆర్టీసీ డీపో మేనేజర్ మురళీకృష్ణ విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం నుంచి అదనపు బస్సులను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు.

# సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



గద్వాలలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

**సాక్షి, నెట్‌వర్క్:** సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, బండారి భాస్కర్, మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు, కౌన్సిలర్లు మురళి, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, నరహరిగౌడ్, నాయకులు నాగరాజు, రమేష్, వెంకటేష్‌యాదవ్, జోగుల రవి తదితరులు పాల్గొన్నారు.